# రాకోయి మా యింటికి...

**బాగా సుపరిచితమైన అతని గొంతు వినగానే వంటింట్లో పని చేసుకుంటున్న వసంత ఉలిక్కిపడి వెంటనే తేరుకుని గబగబా బొడ్లో దోపుకున్న చీర కుచ్చెళ్లని కిందకి దించి, పైట సరిచేసుకుని ఇవతలకు రాబోయింది. అప్పటికే సుడిగాలిలా దూసుకు వచ్చేస్తున్న అతన్ని ఢీ కొట్టబోయి తృటిలో తప్పించుకుని ఇవతలకి వచ్చింది. ఆ ఇంట్లో ఎవరూ చనువు ఇయ్యకపోయినా తనే చనువు తీసుకుని అంతా తిరిగేస్తాడు. సుబ్బారావు!...అతను...**

"అబ్బ! వంటింట్లోంచి రకరకాల ఘుమఘుమలు వస్తూంటేనూ మరి నిలవ లేక పోయాను వదినగారూ! ఏది, ఎన్నాళ్లయింది మీ చేతి వంట రుచిచూసే భాగ్యం నాకు కలిగి!..." అంటూ అక్కడున్న కుర్చీలో కూలబడ్డాడు సుబ్బారావు.

రామ్మూర్తితోపాటు సుబ్బారావు కూడా సుష్టుగా భోంచేసి లేచి చేయి కడుక్కుంటూ "వదినగారూ! మీ చేతిలో ఏం మంత్రం ఉందోగాని చేసిన ప్రతీ ఐటమూ కమ్మగా ఉంటుందనుకోండి. మా ఆవిడ్ని మీదగ్గరికి ట్రైనింగ్‌కి పంపించాలి. అదేమిటో దానికి ఉప్మాకూడా సరిగా చెయ్యడం చేతకాదంటే నమ్మండి" అన్నాడు మనస్ఫూర్తిగా వసంత వంటల్ని మెచ్చుకుంటూ.

వంట అందరూ చేస్తారు! కాని ఇంట్రస్ట్ తీసుకుని కష్టపడి జాగ్రత్తగా చేసేవారు కొంతమందే. తినేవాళ్ళు వంటలు రుచి బావున్నాయని ఒక్కోకసారి మాటవరసకి అన్నా చాలా పొంగిపోయి ఇంకా ఎక్కువ వడ్డించాలని వండిన వాళ్ళకి అనిపిస్తుంది. కొంతమంది ఏదో వంట చేసేం... తిన్నాం... అన్నట్టు చేస్తారు. రుచి-పచి లేకపోయినా వాళ్లకి పదార్థం ముఖ్యం. కడుపు నిండిపోతే చాలు. పాకశాస్త్రం కూడా ఒక కళ. వసంత ఏ వంట చేసినా శ్రద్ధగా, కమ్మగా చేస్తుంది. ఆమె వంటని అందరూ మెచ్చుకుంటారు. ఒక్క రామ్మూర్తి తప్ప! రామ్మూర్తి ఏనాడూ మెచ్చుకోడు.

భర్త తింటుంటే అడుగుతుంది. "కూర బాగుందా?" అని.

"బాగుండకేం చేస్తుంది!" అంటాడు రామ్మూర్తి.

ఫిల్టర్ కాఫీ బ్రహ్మాండంగా చేస్తుంది వసంత.

చిక్కటి ఫిల్టర్ కాఫీ పట్టుకొచ్చి ఇస్తే తాగేసి గ్లాసు పక్కన పెట్టేస్తాడు రామ్మూర్తి.

"కాఫీ బాగుందా? పంచదార సరిపోయిందా? వేడిగా ఉందా?" ఏవో ప్రశ్నలు వెయ్యాలని వేస్తుంది.

"రోజూ తాగే కాఫీకి బాగేమిటి?" అంటాడు.

దాంతో ఒళ్లు మండిపోతుంది వసంతకి.

ఒక్కసారి... ఒకే ఒక్కసారయినా "కాఫీ చాలా బాగుంది వసంతా! ఈ కూర కమ్మగా ఉంది. ఎలా చేసేవోగాని?" లాంటి మెచ్చుకోలు మాటలు రెండుఅంటే కొంపలు అంటుకుంటాయా?

అనిపిస్తుంది వసంతకి.

కాఫీ ఏ ఒక్కరోజైనా బాగులేకపోతే బాగులేదని నలుగురిముందూ అనేస్తారు. "బాగులేదని అనడం వచ్చిన వాళ్ళు బాగుందని మెచ్చుకోవడం కూడా నేర్చుకోవాలి" అంటుంది వసంత ఉక్రోషంగా.

రామ్మూర్తి నవ్వేసి ఊరుకుంటాడు. అయినా అతనిలో ఏ మార్పూ ఉండదు. కాని సుబ్బారావు అలాక్కాదు. చక్కగా అన్ని వంటకాలు చాలా బాగున్నాయని మెచ్చుకుంటూ వసంతని పొగుడుతూ తింటాడు!

★★★

నిన్న మొన్నటిదాకా సుబ్బారావు రామ్మూర్తి ఆఫీసులోనే ఉండేవాడు. ఈ మధ్యనే మరోఊరు ట్రాన్స్‌ఫర్ అయింది. ఇల్లుచూసి ఫామిలీని తీసుకుని వెళ్లిపోయాడు. కాని అప్పుడప్పుడు పనిమీద వస్తుంటాడు. వచ్చినప్పుడల్లా ఇలా రామ్మూర్తి ఇంటికి రావడం, వచ్చి వసంతని పొగడ్తలతో ఉబ్బించేసి రకరకాల వంటకాలు చేయించుకు తినడం అతనికి బాగా అలవాటయిపోయింది.

ఈ ఊర్లో ఉన్నప్పుడు కూడా వసంత, రామ్మూర్తి: సుబ్బారావు ఇంటికి వెళ్ళడం తక్కువే. సుబ్బారావే పెళ్లాం, పిల్లల్ని, పనిపిల్లని, కుక్కపిల్లని కూడా తీసుకుని వీళ్లింటికి పొద్దున్నే వచ్చేసి రాత్రిదాకా ఉండి భోజనాలు... ఫలహారాలు... అన్నీ కానిచ్చి మరీ వెళ్లేవాడు!

వెళ్తూ వెళ్తూ ఒకసారి "వదినగారూ! మా ఇంటికి ఎప్పుడూరారు. ఈసారి మీరిద్దరూ మా యింటికి రాకపోతే నేను మరి గుమ్మం తొక్కను" అనేవాడు. అలా అని మరో రెండురోజులకే వచ్చేసేవాడు. వాళ్లువెళ్లిపోయే ముందురోజు వసంత, రామ్మూర్తి: సుబ్బారావు ఇంట్లో అందర్నీ భోజనానికి పిల్చేరు. పిండివంటలతో సహా అన్ని రకాలు చేసి పెట్టింది వసంత. వెళ్లిపోతున్నప్పుడు సుబ్బారావు పెళ్లాం జానక్కి రవికల గుడ్డ, పసుపు, కుంకం, స్టీలు ప్లేటు, స్వీట్లు, అరటిపళ్లు బొట్టుపెట్టి ఇచ్చింది.

సుబ్బారావు వెళ్లిపోతూ వసంతని, రామ్మూర్తిని వాళ్ళ ఊరికి రమ్మని మరీ మరీ చెప్పాడు. ఆ తర్వాత సుబ్బారావు పనిమీద ఎన్నిసార్లు వచ్చినా వాళ్ల ఊరురమ్మని చెప్తూనే వున్నాడు. అది కూడా మామూలుగా అందర్లాగా కాదు.

"వదినగారూ! మీరు, అన్నయ్యగారూ... శివపార్వతుల్లాగా, సీతారాముల్లాగ అన్యోన్య దంపతులు! మీరు మా ఊరు వచ్చి మీ పవిత్ర పాదధూళితో మా యింటిని పావనం చేస్తే నా జన్మ చరితార్థమవుతుంది" అని డ్రమెటిక్‌గా అన్నాడు. వసంత బోలెడు సరదా పడిపోయింది.

సుబ్బారావు ఎంతమంచి వ్యక్తి, ఎంతటి స్నేహపూరిత హృదయం! అతని హృదయంలో తామిద్దరికి అంతటి ఉన్నతస్థానం ఉన్నందుకు నిజంగానే చాలా సంతోషించింది వసంత.

★★★

"సుబ్బారావు చాలా రోజులైంది రాలేదు కదండీ!"

"అవును. అన్నట్టు వాళ్లుండేది పుణ్యక్షేత్రం కదా. మనం ఎప్పట్నుంచో వెళ్దాం అనుకుంటున్నాం.

ఎలాగూ సుబ్బారావు ఉన్నాడు కాబట్టి మనకి ఎక్కడ ఉండాలి - అన్న సమస్య లేదు. ఎన్నోసార్లు రమ్మని చెప్పాడు. వెళ్లకపోతే బాగుండదు కూడా. ఏమంటావు? అన్నాడు రామ్మూర్తి వసంతతో.

"ఆ ఊరు వెళ్తే... ఇహ అన్నీ సుబ్బారావే చూసుకుంటాడు. కొత్తఊరు, ఎక్కడికి వెళ్లాలో... ఎలా వెళ్లాలో: అన్న బాధలేదు. సుబ్బారావు స్టేషన్‌కి తప్పకుండా వస్తాడు. ఇంతకీ మనం ఎప్పుడు వస్తున్నామో... ఏమిటో ఉత్తరం రాసేరా?" అంది వసంత సంతోషంగా.

"ఆ... ఆ... ఉత్తరం రాసేను. ఫోన్‌లో కూడా మాట్లాడేను..."

"మమ్మీ. మనం అంకుల్ వాళ్లింట్లోనే ఉంటామా?" పిల్లలు అడిగేరు.

"అవున్రా. వాళ్లింట్లో దిగకపోతే అంకుల్‌కి కోపం వస్తుంది. ఏలాడ్జిలోనో దిగేం అనుకో మన సూట్‌కేసులు, బ్యాగ్‌లు బిరబిర ఈడ్చుకుపోతాడు వాళ్లింటికి! అంత ఇది, అతనికి!" నవ్వుతూ అంది.

సుబ్బారావుకి తమమీదున్న ప్రత్యేక అభిమానానికి వసంత లోపల్లోపలే పొంగి పోతున్నది.

★ ★ ★

వాళ్లు రైలు దిగేసరికి మంచి ఎండగా ఉంది. నిప్పులు చెరిగేంత ఎండలో వసంత, రామ్మూర్తి... సామాన్లని, పిల్లల్ని దించి ప్లాట్‌ఫారం ఈ చివరినించి ఆ చివరిదాకా చూసాడు సుబ్బారావు కోసం.

ఆశ్చర్యం! సుబ్బారావు రాలేదు!

"ఉత్తరం అయితే అందడం ఆలస్యం అవచ్చని ఫోన్‌కూడా చేసాను సుబ్బారావుకి. ఎందుచేత రాలేదో!" అన్నాడు రామ్మూర్తి సూట్‌కేసులు పట్టుకుని ముందుకు కదులుతూ.

మంచి లాడ్జి చూసుకుని రూంలో సామాన్లు పెట్టారు.

ఎండవేడి భరించలేనంతగా ఉంది. చల్లటి నీళ్లుపోసుకుని ఫ్రెష్ అవుదామని అనుకుంది వసంత. బాత్‌రూంలో దూరి కుళాయి తిప్పేసరికి ఎండకి వేడెక్కిపోయి చల్లటి నీళ్లకి బదులు వేడినీళ్లు రాసాగాయి!

ఏడుపొచ్చింది ఆమెకి!

ఒకవైపు సుబ్బారావు స్టేషన్‌కి రాలేదని మనసులో ఆశాభంగం, మరొకవైపు ఎండవేడి; పిల్లల అల్లరి;

కడుపులో ఆకలి! దీనికితోడు... చాలా చిరాగ్గా ఉంది వసంతకి.

"ఆఫీసు ఎక్కడుందో కనుక్కుని వెళ్లివస్తాను. సుబ్బారావు ఆఫీసులో ఉండొచ్చు. ఇంటి అడ్రసు ఇమ్మంటే 'మీకెందుకండీ అడ్రసు! నేను స్టేషన్‌కి స్వయంగా వచ్చి మిమ్మల్ని ఇంటికి తీసుకువెళ్తాను కదా! అన్నాడు. ఎండ పేల్చేస్తున్నది. పిల్లల్ని వరండా మీదకి వదలకు. కొత్తచోటు కూడాను. పిల్లల్ని రూంలోనే ఉండమని చెప్పి నువ్వు తలుపు వేసుకో" రామ్మూర్తి బయటకు వెళ్తూ వసంతకి చెప్పేడు.

★ ★ ★

రామ్మూర్తి ఆఫీసుకి వెళ్లేసరికి ఆఫీసులోనే ఉన్నాడు సుబ్బారావు.

"అరె. అన్నయ్యగారా! ఎప్పుడొచ్చారు! స్టేషన్‌కి వద్దామనుకున్నాను గానీ వెధవది ఆఫీసులో అర్జంటు పనొకటి తగిలింది. అందుకని రాలేకపోయాను. కూర్చోండి... అప్పారావ్... రెండు కాఫీ పట్రా!" రామ్మూర్తికి కుర్చీ చూపించి ఆఫీస్ ప్యూన్‌ని కాఫీలు తెమ్మని చెప్పి పంపించాడు.

"నా మిసెస్... పిల్లలుకూడా వచ్చారు. చెప్పానుకదా, అందరం వస్తున్నామని. మళ్లీ రేప్రొద్దున్న ట్రైన్‌కి వెళ్లిపోతున్నాం."

"ఆ... అవునవును... ఇప్పుడెక్కడున్నారు?" అన్నాడు సుబ్బారావు ఫైల్లో తలదూరుస్తూ...

తాముంటున్న లాడ్జీపేరు చెప్పేడు రామ్మూర్తి.

"సాయంత్రం వచ్చి కలుస్తానని చెప్పండి వదినగారికి. చూస్తున్నారుగా, ఇప్పుడు ఎంత వర్కు ఉందో!"

కాఫీ తాగటం పూర్తయ్యాక రామ్మూర్తి లేచాడు వెళ్తానంటూ.

"సుబ్బారావు తనింటికి తీసుకెళ్లే సూచనలేవీ కనపడలేదు. తొందరగా లాడ్జికెళ్లి వసంతని, పిల్లల్ని తీసుకుని హోటల్‌కెళ్లి భోజనాలు చేసిరావాలి" అనుకున్నాడు.

ఆఫీసుగది గుమ్మందాటి నాలుగడుగులు వేసాడో లేదో వెనకనించి సుబ్బారావు మాటలు వినిపించేయి. "ఎవరండీ ఆయన? బాగా పరిచయస్థుల్లాగే ఉన్నారే!" అని ఎవరో సుబ్బారావుని అడిగేరు. "పరిచయస్థులు కాకేమి?" సుబ్బారావు అంటున్నాడు. "కానీ, ఇలాంటి వాళ్లు రోజూ ఎవరో ఒకరు వస్తూనే ఉంటారండీ. ధరలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఎంతకని ఇలాంటి వాళ్లందర్నీ ఎంటర్‌టైన్ చెయ్యగలం చెప్పండి? పోనీ, తను ఒక్కడు కాదు! సకుటుంబ సపరివారంగా వచ్చికూర్చున్నాడు! ఒక్కపూటైనా సరే, వాళ్లందర్నీ కూర్చోబెట్టి మేపడమంటే మాటలా చెప్పండి!"

అవి మాటలు కావు, శూలాలు! అవి తనను పొడుస్తున్నట్టుగా ఉన్నాయి.

రామ్మూర్తికి గొప్పషాక్ తగిలింది!

తను నించున్న చోట భూమి బద్దలయినట్టుగా అనిపించింది.

అసలు కలలోకూడా ఊహించలేని అతని ప్రేమదారిద్ర్యం కళ్లముందు కట్టేసరికి రామ్మూర్తి తట్టుకోలేకపోతున్నాడు. సుబ్బారావేనా ఇలా మాట్లాడుతున్నాడు?

ఎప్పుడూ 'అన్నయ్యగారు, వదినగారు' అంటూ ఇన్నాళ్లయి తనింట్లో ఉంటూ- రకరకాలు చెప్పి చేయించుకుని తింటున్న సుబ్బారావేనా ఇలా అంటున్నాడు? రామ్మూర్తికి నమ్మకం చాలడంలేదు!

"మీరు మాఇంటికి ఎలాగైనా రావాలి. మీరు రాకపోతే నేను ఒప్పుకోను" అని పదిసార్లు పిల్చిన సుబ్బారావు ఇంత హీనంగా మాట్లాడతాడని, మాట్లాడగలడని తనకేనాడూ అనుమానం కూడా రాలేదు!

"వాళ్లింటికొస్తే వాడి జన్మ చరితార్థం అవుతుందని నాటక ఫక్కీలో ఆరోజు అన్నాడు! తను ఆ ఊరికొస్తే హోటల్ ఖర్చులు, భోజనం ఖర్చులు తప్పుతాయి కదా. మనం ఎప్పుడూ వాళ్లఊరు

వెళ్లం. ఊర్లోవున్నా ఎప్పుడూ రానివాళ్లు పైవూరు వెళ్తే ఏం వస్తారులే అని కాబోలు. రానివాళ్లని పిలువవేడుక అన్నట్టు... పోనీ ఓసారి పిల్చేస్తే ఏం పోయింది, ఎలాగూ రారు... అని పిల్చేడు! నిజంగా వెళ్లేసరికి మొహం చాటుచేసుకుంటున్నాడు!" రామ్మూర్తి బాధగా అనుకున్నాడు.

ఇది... సుబ్బారావు అసలు స్వరూపం... అనుకునేసరికి రామ్మూర్తి మనసు కలుక్కుమంది. వడివడిగా అడుగులు వేసుకుంటూ బయటకు నడిచాడు.

లాడ్జికి రాగానే వసంత అడిగింది, "ఏవండీ! సుబ్బారావుని కలిసేరా? మీతోరాలేదేం?"

రామ్మూర్తి చాలా లోతైన మనిషి! దేనికీ బయట పడిపోయే స్వభావం కాదు. ఎలాంటి మనిషినైనా ప్రేమించగలిగే ఓర్పు, మంచితనం అతనికి ఉన్నాయి.

మల్లెపూల సువాసన - మంచి మనిషి యోగ్యత దాచుకుందామన్నా దాగవు!

ఇలాంటి సంఘటనలను ఎదర్కోవలసి వచ్చినప్పుడే రామ్మూర్తిలాంటి వాళ్ల మంచి మనసు మనకి తెలుస్తుంది!

రామ్మూర్తి భార్య మనసుని బాధపెట్టడం ఇష్టంలేక అన్నాడు.

"సాయంత్రం వస్తానన్నాడు. మనం భోంచేసి వద్దాం పదండి"

"అప్పుడొచ్చి వాళ్లింటికి తీసుకెళ్తానన్నాడా?" అంది వసంత భర్త కళ్లల్లోకి చూస్తూ.

ఎదుటివారి చూపులకి దొరకని మనిషి రామ్మూర్తి.

"సాయంత్రం వస్తాడుగా. అప్పుడు అతనే చెప్తాడు! తొందరెందుకు?"

★ ★ ★

సుబ్బారావు సాయంత్రం రాలేదు!

రాడని రామ్మూర్తికి తెలుసు!

అతను నిజాన్ని అంత తొందరగా జీర్ణించుకోలేకపోతున్నాడు.

ఇలాంటి వాళ్లుకూడా ఈ భూమ్మీద ఉంటారనుకుంటే అసహ్యం వేస్తున్నది.

వసంత చాలాసేపు ఎదురు చూసింది సుబ్బారావు కోసం.

ఏవేవో ఊహించుకుంటోంది. "పాపం సుబ్బారావుకి ఆఫీసులో పనెక్కువ వుండి ఉంటుంది. అందుకే స్టేషన్‌కి రాలేకపోయేడు. సాయంత్రం ఆఫీసు అయిపోయేక తిన్నగా ఇక్కడికే వస్తాడు. అల్లంత దూరం నుంచే వదినగారూ! అని కేకేస్తూ "పదండి, మా ఇంటికి! ఇక్కడ దిగేరేమి? ఇల్లు తెలీకపోతే తిన్నగా ఆఫీసుకొచ్చే వలసింది" అంటాడు! అందరం వాళ్లింటికి వెళ్తాం. పాపం వాళ్లావిడకి వంట బాగారాదట కదా. పెళ్లాన్ని పిల్చి ఉప్మా చెయ్యమంటాడు. తను సిగ్గుపడుతూ రాదని అంటుంది. పోనీ అదేమంత బ్రహ్మవిద్య. తనే చొరవగా వంటింట్లో అందరికోసం ఉప్మాచేసి ప్లేట్లలో వేసి పట్టుకొచ్చి ఇస్తుంది. అప్పుడు జానకి తనవైపు ఎంతో కృతజ్ఞతగా చూస్తుంది. సుబ్బారావు కూడా సంతోషపడిపోతూ "మీరు ఒకరోజు... రెండురోజులు ఉంటాం అంటే కుదరదు. కనీసం వారం రోజులన్నా ఉండి మా జానక్కి వంటలన్నీ నేర్పి వెళ్లవలసిందే" అని అభిమానంగా

ఆజ్ఞాపిస్తాడు. తను ముసిముసిగా నవ్వుకుంటుంది. కాని ఆయన ఒప్పుకోరు కదా. "ఎవరింట్లోనైనా సరే ఒక్కరోజుకంటే ఎక్కువ ఉండకూడదు. ఎవరిమర్యాద వాళ్లు దక్కించుకోవాలంటే అదే మంచి పద్ధతి" అంటారు!... ఇలా వసంత ఊహలు అలల్లా సాగిపోతున్నాయి.

సాయంత్రం దేవుడి దర్శనం చేసుకుని, బీచ్‌లో కొంతసేపు కూర్చొని వచ్చేరు. రాత్రి హోటల్‌కి వెళ్లి భోజనాలు చేసి లాడ్జికి వచ్చి పడుకున్నారు. కాని సుబ్బారావు రాలేదు.

మర్నాడు పొద్దున్న ట్రైన్‌కి బయల్దేరారు రామ్మూర్తి, వసంత, పిల్లలు. వసంతకి చాలా నిరుత్సాహంగా ఉంది. ఎప్పుడూ ఎక్కడా ఇంతలా ఆశాభంగం చెందలేదు ఆమె. ఈ ఊరు వచ్చినప్పుడు ఉన్న ఉత్సాహం ఇప్పుడు అసలు లేదు. గాలి తీసేసిన బెలూన్‌లా ఉంది ఆమె మనసు.

రైలు ఇంకా పది నిముషాల్లో బయల్దేరుతుందనగా సుబ్బారావు పరిగెత్తుకొచ్చాడు ఆయాసపడిపోతూ. రైల్లో, వాళ్లు కూర్చున్న చోటికి చేరి, తనూ కూర్చున్నాడు.

"సారీ అండీ వదినగారూ! ఆఫీసులో పనెక్కువగా ఉండి రాలేకపోయాను. మా ఆవిడకి తలనొప్పి. మంచం మీంచి లేవడం లేదు. మీరు వస్తున్నారంటే నేనెంత సంతోషించానో ఆ పరమేశ్వరుడికి తెల్సు! ఈసారి వచ్చినప్పుడు డైరెక్ట్‌గా మా ఇంట్లోనే దిగాలి. లేకపోతే నేనొప్పుకోను సుమండీ!..." సుబ్బారావు ఇంకా ఏవో భారీపువ్వులు పెట్టేస్తున్నాడు వసంత చెవికి. వసంత అంతా నమ్మేస్తోంది.

"సరే, సరే! థాంక్యూ. బండి బైల్దేరడానికి సిద్ధంగా ఉందని ఎనౌన్స్‌మెంటొచ్చింది. వేగిరం దిగిపోండి." అని సుబ్బారావుని ఆ రైలుపెట్లోంచీ తన మనోపేటిక నుంచీ ఒకేసారి దించేసేడు రామ్మూర్తి.

★ ★ ★

*(ఆంధ్రభూమి, వీక్లీ; 14-3-1996)*